క్లుప్తంగా

అమృత్ భారత్‌పై నేడు సమీక్ష

సామర్లకోట: అమృత్ భారత్ పథకంలో భాగంగా సోమవారం ప్రజల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించనున్నట్టు రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ ఆదివారం తెలిపారు. దేశ వ్యాప్తంగా ఈ పథకం కింద ఎంపికైన రైల్వే స్టేషన్లలో సామర్లకోట ఒకటని ఆయన అన్నారు. ఈ మేరకు సోమవారం ఈ పథకాన్ని ఉద్దేశించి ఉదయం 10.30 గంటలకు ఆన్‌లైన్‌లో ప్రధాని మోదీ ప్రసంగిస్తారని రమేష్ తెలిపారు.

జిల్లా క్లాస్‌ఫోర్ ఉద్యోగ సంఘం ఉపాధ్యక్షుడిగా గణేష్


ఉపాధ్యక్షుడు గణేష్‌ను అభినందిస్తున్న కుమార్ తదితరులు

పెద్దాపురం: కాకినాడ జిల్లా క్లాస్ ఫోర్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఆర్డీఓ కార్యాలయ సబార్డినేట్ బి.గణేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం నిర్వహించగా, గణేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో కాకినాడలో నిర్వహించిన ఎన్నికలో గణేష్‌ను ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు అధికారులు ప్రకటించారు. ఆయనను ఆర్డీఓ జేఏఎస్ రామారావు, కార్యాలయ డీటీ భానుకుమార్, క్లాస్ ఫోర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సీనియర్ నాయకులు కుమార్ అభినందించారు.

జనసేనకు పలువురి రాజీనామా

సామర్లకోట: జనసేన పార్టీకి పలువురు రాజీనామా చేశారు. ఈ మేరకు జిల్లా కార్యదర్శి పదవికి పిట్టా జానకి రామారావు, సంయుక్త కార్యదర్శి పదవికి కంచుమర్తి రాజన్న రాజీనామా చేస్తున్నట్లు ఆదివారం రాత్రి ప్రకటించారు. పెద్దాపురం టిక్కెట్టు జనసేన నాయకుడు తుమ్మల బాబుకు వస్తుందని ఆశించారు. అయితే ఉమ్మడి అభ్యర్థిగా టీడీపీకి చెందిన నిమ్మకాయల చినరాజప్పకు సీటు ప్రకటించడంతో జనసేనలో అసంపూర్తి ఏర్పడింది.

రేపు మహా కుంభాభిషేకం

కోటనందూరు: మండలంలోని పాతకొట్టాంలో వేంచేసిన సీతారామస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం మహాకుంభాభిషేకం నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త యడ్ల చెల్లారావు ఆదివారం తెలిపారు. ఉదయం 9 గంటలకు సప్తనదీ జలాలతో మహిళలు గ్రామంలో కలశయాత్ర చేస్తారన్నారు. అనంతరం స్వామివారికి వేద పండితులు పంచామృతాభిషేకం, వార్షిక కల్యాణం, ఊరేగింపు నిర్వహిస్తారని తెలిపారు. మండలంలోని భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పదిలో మెరవండిలా..

- విద్యార్థులను సానపడుతున్న ఉపాధ్యాయులు
- ఆత్మవిశ్వాసం నింపుతున్న విద్యాశాఖ
- విద్యా భారతి పేరున ఉచిత స్టడీ మెటీరియల్


10వ తరగతి విద్యార్థులకు అదనపు తరగతులు

సామర్లకోట: కొన్ని మెళకువలు పాటిస్తే పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు పదిలం చేసుకోవచ్చు. వచ్చే నెల 18 వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఈ పరీక్షల కోసం ప్రభుత్వం అటు విద్యార్థులకు, ఇటు ఉపాధ్యాయులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తోంది. మండల పరిధిలో 9 సెంటర్ల ద్వారా 2,205 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు సిద్ధమవుతున్నట్లు ఎంఈఓ శివరామకృష్ణయ్య తెలిపారు. ప్రతి ఉపాధ్యాయునికి ఆరు నుంచి ఏడుగురు విద్యార్థులను దత్తత ఇచ్చి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తున్నారని, ఈ మేరకు ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం అదనపు తరగతులను నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. పబ్లిక్ పరీక్షలకు ముందుగా ఇప్పటికే మూడు గ్రాండ్ టెస్టులు, ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించి విద్యార్థులలో సామర్థ్యాన్ని గుర్తించి ఏ, బీ, సీ, డీ గ్రేడ్‌లుగా విభజించి వారికి అర్థం అయ్యేలా పాఠ్యాంశాలు బోధిస్తున్నట్టు తెలిపారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహం

విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు సైతం ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా వారిని ప్రోత్సహిస్తున్నామని, వారి ఇళ్లకు వెళ్లిమరీ పర్యవేక్షిస్తున్నామని ఎంఈఓ తెలిపారు. ప్రభుత్వం పాఠశాలలకు ఏర్పాటు చేసిన ఐఎఫ్‌బీల సహకారంతో దృశ్య, శ్రవణ విధానాల ద్వారా విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తున్నట్టు ఆయన తెలిపారు.

ఉపాధ్యాయుల సూచనలతో ముందుకు



పదో తరగతి పరీక్షల్లో టాప్ ఫస్టు వచ్చేలా ఉపాధ్యాయుల సూచనలు, సలహాలు తీసుకుంటున్నాం. పాఠ్యాంశాలను పూర్తిగా అర్థం చేసుకొనేలా హెచ్‌ఎం అవగాహన కల్పిస్తున్నారు. ఉపాధ్యాయులు తమలో ఆత్మ విశ్వాసం నింపి ముందుకు తీసుకువెళ్తున్నారు.

– కత్రి కేశిక, యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్, సామర్లకోట

ప్రశాంతతతో పరీక్షలకు సిద్ధమవ్వాలి



విద్యార్థులు ప్రశాంతతతో పరీక్షలకు సిద్ధమవ్వాలి. ప్రశ్నపత్రాన్ని ఒకటికి రెండుసార్లు జాగ్రత్తగా చదవాలి. తేలిక పాటి ఆహారాన్ని తీసుకోవాలి. పరీక్ష హాల్‌కు నిర్ణీత సమయానికి ముందుగానే చేరుకోవాలి. 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యా భారతి స్టడీ మెటీరియల్ దోహదపడుతోంది.

– యు.సత్యనారాయణ, హెచ్‌ఎం, యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్, సామర్లకోట

క్రీడలకు అధిక ప్రాధాన్యం

- క్యాంప్ ఫైర్‌లో పాల్గొన్న చలమలశెట్టి సునీల్
- ఉత్సాహంగా రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న చలమలశెట్టి సునీల్

సామర్లకోట: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలలో భాగంగా ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన క్యాంపు ఫైర్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సునీల్, నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబులు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సచివాలయం పోస్టులలో 4 శాతం క్రీడాకారులకు రిజర్వేషన్ ఇవ్వడం జరిగిందని వారు చెప్పారు. క్రీడలు నిర్వహించే వారు ముందుకు వస్తే తమ వంతు సహాయ, సహకారాలు ఉంటాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, మున్సిపల్ చైర్మన్ గంగిరెడ్డి కృష్ణమూర్తి, టోర్నీ నిర్వాహక అధ్యక్షుడు ఉబా జాన్‌మోజెస్, కార్యదర్శి కె.పట్టాభిరామం, సహాయ కార్యదర్శి ఉబా కెనడీ, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, పెద్దాపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ అధికార పార్టీ కౌన్సిలర్లు, పీఈటీలు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు శిథిలం


కొత్తపల్లిలో శిథిలమైన వాటర్ ట్యాంక్

కొత్తపల్లి: స్థానిక ఊరచెరువు సెంటర్‌లోని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ శిథిలమైంది. ట్యాంక్ కింద భాగంలో పెచ్చులు ఊడిపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ట్యాంక్‌లు శుభ్రపర్చేందుకు కూడా వీలులేకుండా మెట్లు, ట్యాంక్ పైకప్పు పూర్తిగా శిథిలమయ్యాయి. దీంతో ప్రతీనెలా ట్యాంక్‌లను పంచాయతీ సిబ్బంది శుభ్రపర్చవలసి ఉండగా ఈ ట్యాంక్‌ను ఏ మాత్రం శుభ్రపర్చడం లేదు. ఈ ట్యాంక్ నిర్మించి సుమారు 40 సంవత్సరాలు పూర్తికావస్తున్నా ఈ ట్యాంక్ స్థానంలో కొత్త ట్యాంక్‌ను నిర్మించేందుకు అధికారులు చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ట్యాంకును నెలల తరబడి శుభ్రం చేయకపోవడంతో గ్రామంలోని ప్రజలకు సరఫరా చేసే తాగునీరు కలుషితమవుతోంది. పంచాయతీ కుళాయిల నుంచి రంగు మారిన నీరు వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కొత్త వాటర్ ట్యాంకు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

గండేపల్లి: ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేసి రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కె.నరసింహ నాయక్ సూచించారు. గండేపల్లి పీహెచ్‌సీలో ఆదివారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సిబ్బంది హాజరు, ఓపీ సేవలు, లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్, లాబొరేటరీ, నర్సింగ్ స్టేషన్, ఫార్మసీ సేవలు, రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని సదుపాయాలు కల్పించడంతో పాటు రోగులకు అవసరమైన వసతులు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. వైద్యం నిమిత్తం ఆస్పత్రికి వచ్చిన రోగుల పట్ల సిబ్బంది గౌరవమర్యాదలతో వ్యవహరించాలని డాక్టర్లకు సూచించారు.

వైభవంగా శ్రీపుష్పయాగం


స్వామివారికి శ్రీపుష్పయాగం నిర్వహిస్తున్న పండితులు

కొత్తపల్లి: స్థానిక రుక్మిణీ సత్యభామా సమేత వేణు గోపాలస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి శ్రీపుష్పయాగం కన్నులపండువగా జరిగింది. స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా పండుతులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం పలు రకాల పూలతో శాస్త్రోక్తంగా శ్రీపుష్పయాగం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా శ్రీపుష్పోత్సవం

పెద్దాపురం: మండలంలోని కట్టమూరు కేశవ, పట్టాభిరామ స్వామి వారి దేవస్థానంలో స్వామి వారికి ఆదివారం శ్రీ పుష్పోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ చైర్మన్ మేడిద వెంకట రామారావు, ఈఓ కాట్నం జగన్మోహన శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సుగంధ ద్రవ్యాలు, ప్రత్యేక పుష్పాలు, పట్టుబట్టలతో స్వామిని అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై ప్రసాదాన్ని స్వీకరించారు. సర్పంచ్ పుష్పరత్నం, ఉప సర్పంచ్ చంటిబాబు, సొసైటీ అధ్యక్షుడు చల్లా చిన వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.


శ్రీ పుష్పోత్సవ అలంకరణలో కేశవ పట్టాభిస్వామి

ప్రశాంతంగా గ్రూప్–2 ప్రిలిమ్స్


చేబ్రోలులో పరీక్షలు రాసి బయటకు వస్తున్న అభ్యర్థులు

- నియోజకవర్గంలో 3 సెంటర్ల ఏర్పాటు
- పరీక్షలకు 1736 మంది హాజరు

పిఠాపురం: నియోజగకవర్గంలో ఆదివారం నిర్వహించిన గ్రూప్– 2 ప్రిలిమ్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. గొల్లప్రోలు, చేబ్రోలు, పిఠాపురంలో మూడు సెంటర్లు ఏర్పాటు చేయగా అన్ని చోట్ల ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మూడు సెంటర్లలో 1950 మంది అభ్యర్థులకు గాను 1736 మంది పరీక్షలకు హాజరు కాగా 214 మంది గైర్హాజరయ్యారు. పిఠాపురం బాదం మాధవరావు ప్రభుత్వ హైస్కూల్‌లో మొత్తం 300 మందికి గాను 245 మంది పరీక్షకు హాజరవ్వగా 55 మంది గైర్హాజరయ్యారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ ఇంజినీరింగ్ కళాశాలలో మొత్తం 900 మందికి గాను 804 మంది పరీక్షకు హాజరవ్వగా 96 మంది గైర్హాజరయ్యారు. గొల్లప్రోలు మాదురి విద్యాలయంలో 750 మందికి గాను 687 మంది పరీక్షకు హాజరవ్వగా 63 మంది గైర్హాజరయ్యారు. ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, పిఠాపురం సీఐ శ్రీనివాస్ తమ సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు నిర్వహించారు.

తల్లికి పరీక్ష.. చంటిబిడ్డకు తండ్రి రక్ష


బిడ్డను ఆడిస్తున్న తండ్రి

పిఠాపురం: తల్లి పరీక్షలు రాయడానికి వెళ్లడంతో తండ్రి బిడ్డకు రక్షణగా నిలిచాడు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన గ్రూప్–2 పరీక్షలు రాయడానికి రంపచోడవరం సచివాలయ హెల్త్ అసిస్టెంట్ తన భర్త, బిడ్డతో సహా వచ్చారు. తల్లి పరీక్షలు రాయడానికి వెళ్లడంతో ఆమె వచ్చే వరకూ చంటి బిడ్డను తండ్రి ఎత్తుకుని లాలించాడు.

భరోసా ఇస్తేనే కొనసాగుతాం

- లేకుంటే భవిష్యత్ కార్యచరణ ప్రకటిస్తాం
- జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మల


విలేకరులతో మాట్లాతున్న పెద్దాపురం జనసేన పార్టీ ఇన్‌చార్జి తుమ్మల బాబు

పెద్దాపురం: పార్టీ స్థాపన నుంచి ఉన్న జనసైనికులకు సమాధానం ఇవ్వలేని విధంగా నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి ప్రకటనలో పార్టీ అధినేత చేసిన అన్యాయం దారుణమని, జనసైనికులకు అనుకూల భరోసా కల్పిస్తేనే ఆ పార్టీలో కొనసాగగలమని నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి తుమ్మల బాబు అన్నారు. టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థుల జాబితాలో నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించకపోవడంతో ఆ పార్టీ నాయకులతో బాబు ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి రాత్రి .7.20 వరకు పార్టీ క్యాడర్‌తో సుదీర్ఘ చర్చా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ పరిస్థితి తెలిసి కూడా జనసేనకు కాకుండా టీడీపీకి టిక్కెట్ ఖరారు చేయడంతో జనసైనికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అవసరమైతే స్వతంత్రంగా అయినా పోటీ చేసి సత్తా చాటుదామని సైనికులు శపథం చేశారు. దీంతో బాబు మాట్లాడుతూ గత ప్రజారాజ్యం పార్టీ స్థాపన నుంచి యువరాజ్యం అధ్యక్షుడిగా సేవలందించి పవన్‌కళ్యాణ్ వెంట ఉన్నానని, గత పీఆర్‌పీలో చిరంజీవి ఇచ్చిన గుర్తింపు పవన్ కళ్యాణ్ ఇవ్వకపోవడం చాలా బాధాకరంగా ఉందని బాబు కంటతడి పెట్టడడంతో జనసైనికులు పవన్ కళ్యాణ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అప్పటికీ జనసేన కార్యకర్తలను సముదాయించే ప్రయత్నంలో ఆ పార్టీకి చెందిన కొంతమంది కార్యకర్తలు మాట ఇచ్చి మనసు మార్చుకునే పవన్, చంద్రబాబుల కంటే మాట ఇచ్చి మడమ తిప్పని సీఎం జగన్‌మోహన్‌రెడ్డే సరైనా మార్గమంటూ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అనంతరం బాబు మీడియా ముందుకు వచ్చి స్వయంగా పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పెద్దాపురం నియోజవకర్గానికి విచ్చేసి, ఉమ్మడి అభ్యర్థిగా ప్రకటించిన రాజప్పతో కలిసి జనసేన కార్యకర్తలతో మాట్లాడిన తరువాత సంతృప్తికరమైన భరోసా ఇస్తే పార్టీలో కొనసాగే పరిస్థితి ఉందని, లేకుంటే త్వరలోనే భవిష్యత్ కార్యచరణ ప్రకటిస్తానని తెలిపారు.

ఆనందమీనందమాయె

కొత్తపల్లి: సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులకు ఆదివారం భారీ మత్స్యసంపద చిక్కింది. అమినాబాద్ శివారు చేపలరేవుకు మత్స్యకారులు తమ వలలకు చిక్కిన భారీ కోణాలు, తెల్ల చందువా చేపలను తీసుకువచ్చారు. వీటిని కొనుగోలు చేసేందుకు వ్యాపారులు పోటీ పడ్డారు. సుమారు రూ.5 లక్షల వ్యాపారం జరిగింది. ఈ చేపలను తమిళనాడు, కేరళ, హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తామని వ్యాపారులు తెలిపారు.


మత్స్యకారులకు చిక్కిన కోణెం చేపలు

ఘనంగా వెయ్యి పున్నముల నోము

ఏలేశ్వరం: జీవితంలో అరుదుగా జరిగే వెయ్యి పున్నముల నోము పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన నీటి సంఘం మాజీ సభ్యుడు సామంతుల రామన్నకు వెయ్యి పున్నములు నిండడంతో అతని భార్య రూపామణితో కలిసి కుటుంబ సభ్యులు వేడుక నిర్వహించారు. స్థానిక సామంతుల వారి వీధిలోని రామన్న ఇంటి వద్ద కుమారులు సామంతుల శ్రీకృష్ణ, సామంతుల భాస్కరరావు దంపతుల ఆధ్వర్యంలో పురోహితుడు గాథావఝుల సూర్యనారాయణ సారథ్యంలో వెయ్యి పున్నముల నోము నిర్వహించారు. హిందూ సంప్రదాయంలో అరుదుగా నిర్వహించే ఈ నోమును తిలకించేందుకు బంధువులు, స్నేహితులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. నోముకు వచ్చిన వారు రామన్న దంపతుల ఆశీస్సులు పొందారు. అనంతరం విందు ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, సామంతుల సూర్యకుమార్, సుంకర రాంబాబు, అలమండ చలమయ్య పాల్గొన్నారు.


పార్కింగ్‌లోనే కూర్చొని సేద తీరుతున్న రోగుల సహాయకులు


తల్లీ పిల్ల బొమ్మ ఆవరణలో..


బిచ్చగాళ్లకు నిలయంగా మారిన అటెండర్ల షెడ్

నిర్వహణ లోపమే శాపం..

- రోగుల సహాయకుల అవస్థలు వర్ణనాతీతం
- ఎన్ని వసతులున్నా కొన్నాళ్లకే నిరుపయోగం
- రోగి వైద్యం కోసం పడరాని పాట్లు

కాకినాడ క్రైం: పేదల పాలిట సంజీవని కాకినాడ జీజీహెచ్. వైద్య రంగానికి ప్రభుత్వం అందిస్తున్న నిధులు, ప్రోత్సాహకాలతో వైద్యులు అందిస్తున్న సేవల ద్వారా ఎంతో పేరు ప్రఖ్యాతులు గడించింది. ఇలా ప్రభుత్వం ఎంత చేస్తున్నా నిర్వహణ లోపించడంతో రోగి పక్కన ఉండే సహాయకులకు అవస్థలు తప్పడం లేదు. కుటుంబీకులు ఇచ్చే మానసిక ధైర్యాన్ని మించిన మందు లేదన్నది నిర్వివాదాంశం. రోగి కోలుకోవడంలో ఒకవైపు వైద్యం, మరో వైపు మనోధైర్యం సమాన పాత్ర పోషిస్తున్నాయనడం అతిశయోక్తి కాదు. వారికి ఆస్పత్రి యాజమాన్యం కల్పిస్తున్న వసతుల నిర్వహణ లోపాన్ని పరిశీలిస్తే అయ్యో పాపం అనిపించక మానదు.

కనీస వసతుల కొరత

స్నానపు గదులు, మరుగుదొడ్లు, భోజన శాల, రోజులో విశ్రాంతి తీసుకునేందుకు, కూర్చునేందుకు కనీసం కుర్చీలు, నిద్రించేందుకు పడక, ఫ్యాను వంటి కనీస వసతులు లేక రోగుల సహాయకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అన్నీ ఉండీ అగచాట్లు

ఆస్పత్రిలో ఎన్ని సదుపాయాలు సమకూర్చినా నిర్వహణలోపంతో అన్నీ మూలకు చేరి యాజమాన్యం వైఫల్యాన్ని చూపుతోంది. రూ.లక్షల విలువైన మౌలిక వసతులు ఉన్నా నేడు నిరుపయోగంగా మూలకు చేరినవెన్నో ఉన్నాయి.

అన్నింటికీ అవస్థలే

తీరిగ్గా కూర్చుని నాలుగు ముద్దలు తిందామంటే టేబుళ్లు ఉండవు. ఫ్యాన్లు ఉన్నా తిరగవు. స్నానపుగదులు, మరుగుదొడ్లు, నీటి వసతి మాటేలేదు.


జీజీహెచ్‌లోని ఓ వార్డులో అందరూ నడిచే మార్గం మధ్యలో నిద్రకు ఉపక్రమించిన రోగుల బంధువులు

ఉన్నా నిర్వహణ అధ్వానం. రాత్రివేళ అయితే రోగి పక్కనే కొంత జాగా చూసుకుని మూడంకె వేయాల్సిందే.

కంపు కొడుతూ అటెండర్ షెడ్

ఆరేళ్ల క్రితం నిర్మించిన అటెండర్ షెడ్ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. నిర్వహణ లేక దుర్వాసన వెదజల్లుతోంది. బిచ్చగాళ్లకు, శునకాలకు నిలయంగా ఆస్పత్రి ఆవరణ మారిపోయింది.

ఇలా చేస్తే మేలు

- జీజీహెచ్‌లో ఖాళీ ప్రదేశాల్లో చెక్క లేదా సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయాలి.
- ఆస్పత్రిలో నీడనిచ్చే చెట్ల పెంచాలి.
- ప్రతి వార్డు ఆవరణలో కుర్చీలు ఏర్పాటు చేయాలి.
- ఇప్పటికే ఉన్న కుర్చీలలో పాడైన వాటి మరమ్మతులు చేపట్టాలి.
- ప్రతి వార్డులో మంచి నీటి సదుపాయం కల్పించాలి.
- ఫ్యాన్లకు మరమ్మతులు, అదనపు ఫ్యాన్లు సమకూర్చాలి.
- రోగులకు సమీపంలో వారి బంధువులకు నిర్ణీత వ్యవధికి పడక ఏర్పాట్లు చేయాలి.
- రోగి పడక వద్దే బంధువులకు భోజనానికి ఏర్పాట్లు చేయాలి.
- కుక్కల నియంత్రణకు సత్వర చర్యలు తీసుకోవాలి.
- వీటన్నింటి పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించాలి.
- రోగుల బంధువుల సమస్యలు పరిష్కరించేలా స్వచ్ఛంద సంస్థలు, దాతలు సహకరించాలి.


ఓపీ పరిసరాల్లో ఫ్యాన్లు తిరగక రోగుల సహాయకుల అవస్థలు

వసతులు వినియోగంలోకి తెస్తాం



జీజీహెచ్‌లో రోగుల సహాయకుల సౌలభ్యం కోసం ఇప్పటికే ఆస్పత్రిలో ఉన్న సదుపాయాలను పునర్వినియోగంలోకి తీసుకువస్తాం. అలాగే వాటి మరమ్మతులు పూర్తి చేసి వారం రోజుల వ్యవధిలో అందుబాటులోకి తెస్తాం. ఏఏ ప్రాంతాల్లో ఎటువంటి సదుపాయాలు అవసరమో పరిశీలిస్తాం. రోగులు, వారి సహాయకుల సదుపాయాల కల్పనలో భాగస్వాములవ్వాలనే స్వచ్ఛంద సంస్థలు లేదా దాతలు నేరుగా మమ్మల్ని సంప్రదించవచ్చు. తోడ్పాటు అందించిన వారి పేరును సమకూర్చిన సదుపాయాలపై ప్రచురిస్తాం.

– డాక్టర్ ఎంపీఆర్ విఠల్, సూపరింటెండెంట్, జీజీహెచ్